క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.1.56 లక్షల విరాళం



దాతలకు అమ్మవారి చిత్రపటం అందచేస్తున్న ఆలయ అధికారి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి ప్రకాశం జిల్లాకు చెందిన భక్తులు శనివారం రూ.1.56 లక్షల విరాళం సమర్పించారు. గిద్దలూరుకు చెందిన ఏదూరి శ్రీనివాసరెడ్డి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి విరాళం అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అధికారి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

పలకల పరిశ్రమను ఆదుకోవాలని మంత్రికి వినతి

మార్కాపురం టౌన్: మార్కాపురంలోని పలకల పరిశ్రమను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మంత్రి సుబాష్‌కు పంచాయితీరాజ్ అతిథి గృహంలో శనివారం బీజేపీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. పట్టణంలో పలకల పరిశ్రమ గతంలో వేలాది మందికి జీవనోపాధి కల్పించిందని, ఇటీవల కాలంలో ఒడిదుడుకులు ఎదుర్కోవడంతో ప్యాక్టరీలు మూతపడి కార్మికులకు జీవనోపాధి లేదన్నారు. పలకల పరిశ్రమకు రాయితీలు, ప్రోత్సహాకాలు ఇవ్వాలని బీజేపీ ఇన్‌చార్జి కృష్ణారావు కోరారు. లేకపోతే కార్మికులందరూ వలసలు పోతారన్నారు. తగిన న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, డాక్టర్ కిరణ్, సతీష్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

పేదరిక రహిత సమాజం నిర్మిద్దాం

మార్కాపురం: పేదరిక రహిత సమాజంను నిర్మించేందుకు అందరు కలిసిరావాలని మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డోలా బాల వీరాంజనేయ స్వామిలు అన్నారు. శనివారం పట్టణంలోని ప్రవేటు కళ్యాణ మండపంలో పీ–4 కార్యక్రమంపై జరిగిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రులు మాట్లాడుతూ జిల్లాలో 74 వేలకు పైగా కుటుంబాలను గుర్తించామని, వీరిని బంగారు కుటుంబాలుగా పెర్కొంటున్నట్లు తెలిపారు. వీరికి సహాయం అందించేవారిని మార్గదర్శకులుగా పిలుస్తామన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వెబ్‌సైట్‌లో వివరాలు ఉంచామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 5434 మంది మార్గదర్శకులు ముందుకు వచ్చి 31,367 కుటుంబాలను దత్తత తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో జేసి గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ త్రివినాగ్, ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఎన్.బాలాజీ, ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, దామచర్ల జనార్దన్, అశోక్‌రెడ్డి, బీఎన్ విజయ్ కుమార్, ఉగ్ర నరసింహారెడ్డి, పలువురు ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

ఆగస్టు 6న ఐద్వా మహాసభ

మార్కాపురం టౌన్: పట్టణంలో వచ్చే నెల 6న జరిగే ఐద్వా పట్టణ మహాసభను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి కె.రమాదేవి కోరారు. శనివారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ మద్యం షాపులకు విచ్చలవిడిగా అనుమతులు ఇచ్చి, లక్ష్యాలు పెట్టి వ్యాపారంగా మార్చడం సిగ్గుచేటన్నారు. మహిళలకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల మీద నిత్యం జరుగుతున్న హింస, అత్యాచారాలకు వ్యతిరేకంగా చేపట్టబోయే ఆందోళన కార్యక్రమాలను సమావేశంలో రూపొందిస్తామన్నారు. పట్టణ శివారులో నీటి సమస్య ఏర్పడిందన్నారు. పలు అంశాలపై మహాసభలో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటియూ కార్యదర్శి రఫీ, రూబెన్, శార, రెహానాబేగం, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

మార్కాపురం: మండలంలోని పెద్ద యాచవరంలో పాస్టర్‌లు కె.సాల్మన్‌రాజు, అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో నిరుపేద చిన్నారులకు దుస్తులను పంపిణీ చేశారు. వృద్ధులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమన్నారు. పేదలకు సేవ చేసే విషయంలో క్రీసు సంఘం ముందుంటుందన్నారు.

విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ



తర్లుపాడు: మండలంలోని జగన్నాథపురం ఎంపీపీఎస్ పాఠశాలలో హెచ్ఎం జగన్‌బాబు విద్యార్థులకు సొంత నిదులతో నోటుబుక్కులు, పెన్సిల్‌లు, పలకలు, ఎగ్జామ్ ప్యాడ్‌లను, ఇంగ్లిషు కాపీరైటింగ్ పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్ఎంను అభినందించారు.

సమస్యలతో సహజీవనం..
సంక్షోభంలో సంక్షేమం!

- వసతి గృహాల్లో ఎక్కడికక్కడ పేరుకుపోయిన సమస్యలు
- ఎప్పుడు కూలుతాయో తెలియని భవనాల కింద చదువులు
- రాత్రిపూట దోమలతో సహజీవనం
- కనీస సౌకర్యాలు కరువు
- సరిగా అందని కాస్మొటిక్స్



రాచర్ల: అనుమలవీడులో శిథిలావస్థకు చేరిన బీసీ హాస్టల్

సాక్షి విజిట్

కంభం/అర్థవీడు/రాచర్ల/కొమరోలు/గిద్దలూరు రూరల్/బేస్తవారిపేట: పేద, మధ్య తరగతి కుటుంబాలకు అదొక దేవాలయంలాంటిది. ఉడికీఉడకని అన్నం, నీళ్ల సాంబారు, రుచీపచీలేని చట్నీ, పడుకునేందు సరైగా జగాలేని దుస్థితి. ఊడిపోయిన కిటికీలు, వానకు తడుస్తూ, చలికి వణుకుతూ అపరిశుభ్ర వాతావరణంలో చదువులీడుస్తున్నారు సంక్షేమ వసతి గృహ విద్యార్థులు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసింది. ప్రైవేటు, కార్పొరేట్‌ల సేవలో నిమగ్నమై పేదల చదువులను అటకెక్కించింది. సమస్యల వలయంలో ప్రభుత్వ బీసీ, ఎస్సీ వసతి గృహాలు చిక్కుకున్నాయి. విద్యార్థులకు సరిపడా సౌకర్యాలు కల్పించడంలో అధికారులు, పాలకులు విఫలమయ్యారు. కనీస మౌలిక వసతులు లేక ఇరుకు గదుల్లో బాల,బాలికలు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం వంట చేసేందుకు మంట మనుషులు లేకపోవడంతో వార్డెన్‌లు సమస్యలతో సతమతమవుతున్నారు. సాక్షి విజిట్‌లో కనబడిన దృశ్యాలు ఓ సారి చూద్దాం..

☛ బేస్తవారిపేట మండలంలో బీసీ హాస్టల్స్ 02, ఎస్సీ హాస్టల్స్ 03 ఉన్నాయి. బేస్తవారిపేట బీసీ హాస్టల్ అద్దె రేకుల షెడ్డులో నిర్వహిస్తున్నారు. టాయిలెట్స్‌కు రన్నింగ్ వాటర్ వసతిలేదు. వంట చేసేందుకు వంటమనిషి లేకపోవడంతో అటెండర్, వాచ్‌మెన్ దిక్కయ్యారు. బేస్తవారిపేటలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో 230 మంది విద్యార్థినిలు ఉన్నారు. అద్దె గృహంలో ఇరుకైన గదుల్లో తీవ్ర అసౌకర్యాల నడుమ నిర్వహిస్తున్నారు.

☛ కంభం మండలంలో బీసీ హాస్టల్స్ 02, ఎస్సీ హాస్టల్స్ 05 ఉన్నాయి. కళాశాల హాస్టల్‌లో 140 మంది విద్యార్థులు ఉన్నారు. సరైన వసతులు లేని అద్దె రేకులషెడ్డులో నిర్వహిస్తున్నారు. బీసీ బాలుర హాస్టల్‌లో వాచ్‌మెన్ వంట వండుతున్నారు. కూరగాయల ధరలు పెరగడం, ప్రభుత్వం సరఫరా చేసే బియ్యంలో పురుగులు ఉండటంతో నాణ్యమైన భోజనం అందడం లేదు.

☛ అర్థవీడు మండలంలో బీసీ–01, ఎస్సీ–02 హాస్టల్స్ ఉన్నాయి. మూడు హాస్టల్స్ అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. బీసీ హాస్టల్‌లో వంట మనిషి లేకపోవడంతో వాచ్‌మెన్‌తో వంట వండిస్తున్నారు. మూడు హాస్టల్స్‌లో ఒక్కొక్క బాత్‌రూమ్ ఉండటంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు.

☛ రాచర్ల మండలంలో బీసీ హాస్టల్స్ 02 ఉన్నాయి. అనుమలవీడు హాస్టల్ శిథిలావస్థకు చేరి పెచ్చులూడి పడుతున్నాయి. నాలుగు గదులు మూత వేశారు. రెండు గదుల్లో భయాందోళన మధ్యన విద్యార్థులు ఉన్నారు. కొన్నింటి బాత్‌రూమ్ తలుపులు విరిగిన పట్టించుకోలేదు.

☛ కొమరోలు మండలంలో 03 బీసీ, 01 ఎస్సీ హాస్టల్ ఉన్నాయి. గోపాలునిపల్లె బీసీ హాస్టల్ రేకుల షెడ్డులో నిర్వహిస్తున్నారు. మరుగుదొడ్లు లేవు, ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి. అల్లీనగరం బీసీ వసతి గృహం శిధిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది.

☛ గిద్దలూరులో బీసీ 04, ఎస్సీ 06 హాస్టల్స్ ఉన్నాయి. గిద్దలూరులోని ఎస్సీ–2 హాస్టల్‌లో బురదలో ప్లేట్లను వాష్ చేసుకోవాలి. స్త్రీశిశు సంక్షేమశాఖ బాలసదనంలో మూడేళ్లుగా వార్డెన్ లేకపోవడంతో సర్వేక్షకురాలితో నిర్వహణ చేస్తున్నారు. 24 గంటలు ఒక్కరే హాస్టల్‌లో ఉండాలంటే తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.



కంభం: ఎస్సీ హాస్టల్ వద్ద పందుల స్వైరవిహారం



కొమరోలు:కూలేందుకు సిద్ధంగా ఉన్న అల్లీనగరం బీసీ హాస్టల్



కంభం: ఆరుబయట స్నానం చేస్తున్న బీసీ హాస్టల్ విద్యార్థులు



బేస్తవారిపేట: కళాశాల హాస్టల్‌లో నేలపై పడుకున్న విద్యార్థులు

బాటిళ్లతో బహిర్భూమికి..

మార్కాపురం/మార్కాపురంటౌన్ /తర్లుపాడు /కొనకనమిట్ల/పొదిలి: సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులకు సంక్షోభ హాస్టళ్లుగా మారాయి. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలన్నర దాటినా వారికి అందాల్సిన ట్రంకుపెట్టె, దుప్పట్లు, కాస్మొటిక్ చార్జీలు ఇంతవరకూ అందించలేదు. దీనితో ఇంటినుంచే డబ్బులు తెప్పించుకుంటూ నిత్యావసరాలను తీర్చుకుంటున్నారు. ప్రభుత్వం దృష్టిపెట్టకపోవడంతో అవస్థలతో సహజీవనం చేస్తున్నారు.

☛ మార్కాపురం నియోజకవర్గంలో 19 ప్రభుత్వ హాస్టళ్లు ఉన్నాయి. ఇందులో ఎస్సీ హాస్టల్స్ 09, ఎస్టీ హాస్టల్స్ 03, బీసీ హాస్టల్స్ 07 ఉన్నాయి. పలు మండలాల్లో ఉన్న హాస్టల్స్ అద్దెభవనాల్లో నిర్వహిస్తున్నారు. శిథిలావస్థకు చేరి, పెచ్చులూడిపోయి ఎప్పుడు కూలుతాయో తెలీని పరిస్థితి నెలకొంది. తర్లుపాడు, పొదిలి, కొనకనమిట్ల మండలాల్లోని పలు హాస్టల్స్‌కు బాత్‌రూములు సక్రమంగా లేకపోవడంతో ఆరుబయటే స్నానం చేయాల్సిన పరిస్థితి దాపురించింది. కూటమి ప్రభుత్వంలో హాస్టల్స్ నిర్వహణ అధ్వానంగా మారిందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కాపురం, తర్లుపాడు, పొదిలి, కొనకనమిట్ల హాస్టల్స్‌లో కొన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వర్షాకాలం కావడంతో రాత్రిపూట దోమలతో విద్యార్థులు నిద్రకు దూరమవుతూ, వాటితో సహజీవనం చేస్తున్నారు. డివిజన్ కేంద్రమైన మార్కాపురంలో బాలికల కోసం ఇటీవలే ప్రత్యేక హాస్టల్ మంజూరైనప్పటికీ ఇంకా ప్రారంభం కాలేదు. ఎప్పుడవుతుందో కూడా ఇంకా తెలీదు. బీసీ బాలికల హాస్టల్ లేకపోవడంతో పలువురు విద్యార్థినులు పీజి హాస్టల్స్‌లో మరికొందరు ఇల్లు అద్దెకు తీసుకుని చదువుకుంటున్నారు.



మార్కాపురంలో బీసీ హాస్టల్‌లో 60 మందికి గాను 2 బాత్‌రూములు ఉన్న దుస్థితి

☛ మార్కాపురం పట్టణంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ బాలుర, బాలికల హాస్టల్స్ ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి. తర్లుపాడు రోడ్డులోని బీసీ బాయ్స్ హాస్టల్‌లో 5 నుంచి 10వ తరగతి వరకూ 70 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈనెలాఖరువరకూ అడ్మిషన్లు జరుగుతున్న సందర్భంగా విద్యార్థులు చేరే అవకాశం ఉందని హాస్టల్ వార్డెన్ తెలిపారు. మార్కాపురం పట్టణంలో ఎస్సీ కాలేజీ బాయ్స్ హాస్టల్ (ఇంటర్ నుంచి పైచదువుల వరకూ) విద్యార్థులు చదువుకుంటుంటారు. విద్యార్థులకు సరిపడ వసతి గదులు, టాయిలెట్లు, బాత్‌రూములు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

ఆరుబయట స్నానం.. పొలాల్లోకి బహిర్భూమికి !

ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమంకోసం కోట్లలో ఖర్చుచేస్తున్నామని చెబుతున్నా అవి నిరుపయోగంగా మారుతున్నాయి. తర్లుపాడు బీసీ హాస్టల్‌లో సుమారు 80 మంది విద్యార్థులు హాస్టల్‌లో ఉండి వివిధ తరగతులు చదువుతున్నారు. అద్దె భవనం కావడంతో స్నానాలు చేసే బాత్‌రూము, టాయిలెట్‌లు శిథిలావస్థకు చేరాయి. దీనితో విద్యార్థులు సమీప పొలాల్లోకి బహిర్భూమికి వెళ్లాల్సిన దుస్థితి, అంతేకాక ఆరుబయట స్నానం చేస్తున్నారు.

☛ పొదిలి పట్టణంలో రెండు వెనుక బడిన తరగతుల వసతిగృహాలు, రెండు సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో సుమారు 300 మంది బాల బాలికలు ఉంటున్నారు. బీసీ బాలుర వసతిగృహం భవనం శిథిలావస్థకు చేరింది. కొన్ని గదులు స్లాబు పెచ్చులూడుతుంది. వర్షం వస్తే స్లాబు లీకు అవుతుండటంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

☛ కొనకనమిట్ల ఎస్సీ హాస్టల్‌కు భవనం లేకపోవడంతో కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నారు. గొట్లగట్టు బీసీ హాస్టల్ ప్రహరీ కూలేందుకు సిద్ధంగా ఉంది. ఇక్కడ 150 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారికి సరైన మరుగుదొడ్లు, నీటి వసతి లేక అవస్థలు పడుతున్నారు. ఒక హాలులోనే విద్యార్థులందరూ తమ ట్రంకు పెట్టెలను పక్కనపెట్టుకుని నిద్రపోతున్నారు.

> **రూ.1.43 కోట్లతో హాస్టల్స్‌కు మరమ్మతులు..**
>
> మార్కాపురం, దర్శి, బేస్తవారపేట పరిధిలోని వివిధ హాస్టళ్లలో రూ. 1.43 కోట్లతో మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. ఇందులో మార్కాపురం పరిధిలోని పొదిలి ఎస్సీ బాయ్స్ హాస్టల్‌కు రూ.33.76 లక్షలు, గరల్స్ హాస్టల్‌కు రూ.34.50 లక్షలు, మండలంలోని గజ్జలకొండ ఎస్సీ బాయ్స్ హాస్టల్‌కు రూ.20 లక్షలు, పట్టణంలోని ఎస్సీ గరల్స్ హాస్టల్‌కు రూ.30 లక్షలు, తర్లుపాడు ఎస్సీ బాయ్స్ హాస్టల్‌కు రూ.20 లక్షలు మంజూరయ్యాయని, కొన్ని పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు.
>
> – అరుణ, ఏఎస్‌డబ్ల్యూ, మార్కాపురం



తర్లుపాడులో ఆరుబయట స్నానం చేస్తున్న విద్యార్థులు



గొట్లగట్టులో ఒరిగిన గోడ వద్ద కూర్చుని చదువుకుంటున్న విద్యార్థులు

సైనికుల త్యాగాలు మరవకూడదు



విజయ్ దివస్ ఆకారంలో విద్యార్థులు

మార్కాపురం టౌన్: సైనికుల త్యాగాలు మరవకూడదని కిట్స్ కళాశాల కార్యదర్శి అన్న కృష్ణచైతన్య తెలిపారు. శనివారం కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా కళాశాలలో యుద్ధంలో అమరులైన సైనికుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యుద్ధంలో మరణించిన వీరజవాన్‌లకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ యూనిట్ పీవో అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. కమలా హైస్కూల్‌లో ప్రిన్సిపల్ పుల్లయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్గిల్ విజయ్ దివాస్ వేడుకలలో విద్యార్థులు విజయ్ దివస్ ఆకారంలో ఏర్పాటుచేసిన పిరమిడ్ రూపంలో పాల్గొన్నారు. అనంతరం దేశభక్తిని ప్రదర్శించే నాటికలో పాల్గొన్నారు.



అమరవీరుల స్థూపం వద్ద మంత్రి సుభాష్, ఎమ్మెల్యే తదితరులు

కార్గిల్ విజయ్ దివస్‌లో మంత్రి..

మార్కాపురం: పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో గల అమరవీరుల స్థూపం వద్ద శనివారం కార్గిల్ విజయ్ దివస్ వేడుకలను నిర్వహించారు. రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాస్, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో పాటు కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులు శేషసాయి, శీలం హరినారాయణ, ఎస్.రామకృష్ణ, ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అమర వీరులకు ఘనంగా నివాళులర్పించి వారి సేవలను కొనియాడారు.

శాస్త్రీయ ఆలోచనలతోనే సమాజాభివృద్ధి



మహాసభల పత్రికలను విడుదల చేస్తున్న జేవీవీ

గిద్దలూరు రూరల్: శాస్త్రీయ ఆలోచనలతోనే సమాజాభివృద్ధి సాధిస్తుందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు పి.స్వరూపారెడ్డి అన్నారు. పట్టణంలోని రాజుపారా మెడికల్ కాలేజీలో శనివారం జనవిజ్ఞాన వేదిక మహా సభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైన్స్ అంటే రసాయనాలు పరిశోధనలే కాదు సువిశాల మైన సమాజంలోని సమస్యలను వెలికి తీసేందుకు పనిచేయాలన్నారు. సైన్స్ తగ్గిపోయే కొద్ది అనేక రకాల చాందస్త భావాలు పెరిగి సమాజానికి హాని కలిగిస్తాయన్నారు. వైజ్ఞానిక దృక్పథాన్ని ప్రజలకు వివరిస్తు వారిని చైతన్య పరిచేందుకు జనవిజ్ఞాన వేదిక ప్రయత్నిస్తుందన్నారు. ఆగస్టు 9, 10వ తేదీల్లో గిద్దలూరులో 18 వ మహాసభలు నిర్వహించబడుతాయన్నారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు మండ్లా శ్రీనివాసులు, డి.జి.బ్రహ్మానందరెడ్డి, వెంకటేశ్వర్లు, ఎ.శివశంకర్, కె.రాజా, విశ్వరూపం, ఈశ్వర్‌కుమార్, కొండేటి రాజేష్, విజయలక్ష్మీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారం

పొదిలి: మంచినీరు, పారిశుధ్యం, విద్యుత్ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ కమిషనర్ నారాయణరెడ్డి అన్నారు. శనివారం కంభాలపాడు, పోతవరం, జాష్లాపురం, బాలాజి నగర్, నందిపాలెం గ్రామాల్లోని సమస్యలను పలువురు కమీషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా వార్డుల్లో కమిషనర్ పర్యటిస్తూ జరుగుతున్న పనులను పరిశీలించారు. రోడ్డు మార్జిన్‌లలో ఉన్న చిల్ల చెట్లను తొలగించటం, సైడు కాలువల్లో పూడికతీత, మంచినీటి కుళాయిల మరమ్మతు పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. 'పురసేవ' యాప్‌ను ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొని సమస్యలపై ఫిర్యాదు చేయటంతో పాటు సేవలను కూడా సులబంగా పొందవచ్చన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్స్పెక్టర్ మారుతీరావు ఉన్నారు.

పేద కుటుంబాలను వృద్ధిలోకి తేవాలి



ఉప్పలపాడులో మాట్లాడుతున్న ఎంపీడీవో

పొదిలి రూరల్: అట్టడుగు స్థాయి కుటుంబాలను పేదరికం నుండి పైకి తీసుకరావడమే పీ–4 లక్ష్యమి ఎంపీడీవో గుత్తా శాభన్‌బాబు అన్నారు. శనివారం పొదిలి మండలంలోని ఉప్పలపాడులో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సహాయం కోరుకునే కుటుంబాలను గుర్తించడం ద్వారా సహాయం చేయాలి అనుకునే వారికి సరైనటువంటి సమాచారం ఇవ్వడం అబివృద్ధి సాధించవచ్చున్నారు. పేదల గుర్తింపు కోసం చేపడుతున్న సర్వే వల్ల ప్రభుత్వ పథకాలకు దూరమయ్యే అవకాశం లేదన్నారు. ఈ సభలో సర్పంచ్ గుంటూరి ఏసోబు, కార్యదర్శి శేషగిరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పద్మావతి వెంకటేశ్వరుడికి పూజలు

అర్థవీడు: మండల పరిధిలోని మాగుటూరు గ్రామంలో వెలసిన పద్మావతి వెంకటేశ్వరస్వాముల వారికి భక్తిశ్రద్ధలతో శనివారం పూజలు నిర్వహించారు. కోర్కెలు తీరిన భక్తులు 101 ప్రదర్శనలు చేసి ముక్కులు తీర్చుకున్నారు. స్వాముల వారికి భక్తులు కాయకర్పూరాలు సమర్పించి, అనంతరం తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. వర్షాలు బాగా కురిసి చెరువులు, కుంటలు నిండాలని భక్తులు విన్నవించుకున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

కొనకనమిట్ల: విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ప్రభాకరరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మర్రిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎస్.నాగేశ్వరరావు పర్యవేక్షణలో విద్యార్థులతో సమావేశం నిర్వహించి వారికి విద్యార్థి దశలో ఎలా నడుచుకోవాలి, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిపించారు. చదువుకునే సమయంలో పక్కదోవ పడితే ఎదుర్కొనే ఇబ్బందులు గురించి తెలియజేశారు.

శ్రీశైలం వెళ్లే భక్తులకు బస్సుల కొరత



బస్టాండ్‌లో వేచిఉన్న కన్నడ భక్తులు

మార్కాపురం: మార్కాపురం నుంచి శ్రీశైలం వెళ్లే భక్తులకు బస్సుల కొరత ఏర్పడింది. దీంతో మార్కాపురం బస్సాండ్‌లో రెండు గంటల పాటు వేచి ఉండాల్సిన పరిస్తితి ఏర్పడింది. కర్ణాటకకు చెందిన సుమారు 200 మంది భక్తులు శనివారం ఉదయం రైలు దిగి మార్కాపురం బస్టాండ్‌కు వచ్చారు. ఆ సమయంలో శ్రీశైలం వెళ్లేందుకు బస్సులు లేకపోవటంతో పిల్లాపాపలతో తాము వెంటతెచ్చుకున్న సామాన్లతో రెండు గంటలతో పాటు బస్టాండ్ ఆవరణలో ఇబ్బందులు పడ్డారు. సమాచారం తెలుసుకున్న డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు అక్కడికి వచ్చి రెండు ఆర్డినరి, మూడు ఎక్స్‌ప్రెస్ బస్సులను ఏర్పాటు చేసి పంపించినట్లు తెలిపారు. అనుకోకుండా ఎక్కువ సంఖ్యలో ప్రయాణికులు రావటంతో బస్సులు సరిపోలేదని, వెంటనే ప్రత్యేక సర్వీసులను ఏర్పాటుచేసి వారిని పంపినట్లు డీఎం తెలిపారు.